# అవగాహన

-డా.కొఠారి వాణీచలపతిరావు

ఆరోజు తనను చూడటానికి పెళ్లివారు వస్తున్నారని తల్లి రాజేశ్వరి చెప్పినప్పటినుంచీ ప్రియ మనసు మనసులో లేదు. ఏదో దిగులు...ఎందుకో చిరాకు..ఇది అని చెప్పలేని భయం!

"పెళ్లి చూపులు అనగానే ముఖం అలా పెట్టావేమిటే? సాయంత్రం వాళ్లముందు కూడా ఇలాగే కూర్చుంటావా?" అంది రాజేశ్వరి. ఆ మాటలతో వళ్లు మండిపోయింది ప్రియకు.

"వాళ్లముందు నేను కూర్చోవటం ఏమిటి...చాపేసి...తలవంచి కూర్చోబెడతావా నన్ను?" అంది చిరుబురులాడుతూ.

"మీ అక్కలిద్దరినీ అలాగే కూర్చోబెట్టానుగానీ...నిన్ను మాత్రం కాదులే...కొరకరాని కొయ్యవు కదా నువ్వు...!" అంది రాజేశ్వరి విసురుగా.

దాంతో...అక్కల పెళ్లి చూపుల దృశ్యం సినిమాలో ఫ్లాష్‌బ్యాక్‌లా ప్రియ కళ్లముందు బొమ్మ కట్టింది. అప్పుడు తను గౌన్లు...పొట్టి పొట్టి స్కర్టులు వేసుకునే వయసులో ఉంది.

అక్క పెళ్ళి చూపులు అనగానే ఇంటి వాతావరణమంతా సందడిగా మారిపోవటంతో తనూ ఆరోజు స్పెషల్‌గా సిల్కు లంగా వేసుకుని...జడలో పూలు పెట్టుకుని ఇంటిముందు గెంతులేస్తూ, ఇంకాసేపట్లో రాబోతున్న కారు కోసం ఎదురు చూసేది.

కారు వచ్చాక అమ్మా, నాన్న చేసే హడావుడీ...స్వీట్లూ, హాట్లూ పెట్టి చేసే మర్యాదలు...ఆ తరువాత పెళ్ళి చూపుల తంతూ...అన్నీ గమ్మత్తుగా అనిపించేవి.

పెద్దక్క పెళ్ళిచూపులప్పుడు బావ, వాళ్ళ అమ్మా నాన్న, అక్క వచ్చారు. వాళ్లుకాక మరొక ఆయన...ఆయన మధ్యవర్తి అట! బావ సూటు, బూటు వేసుకంటే, వాళ్ళ అమ్మ చారెడంత ఉన్న జరీ పట్టుచీర కట్టుకుని, మెడ తిప్పటానికి కూడా వీలులేనంతగా భారీ నగలు పెట్టుకుని, రూపాయి బిళ్ళంత బొట్టు...రెండు చేతులకు నిండుగా బంగారు గాజులు వేసుకుని వుంది. వాళ అక్క కూడా తల్లికి కార్బన్ కాపీలా వుంది. తండ్రి మాత్రం పంచె కట్టుకుని...సిల్కు చొక్కా మీద జరీ అంచు కండువా వేసుకుని ఉన్నాడు.

పెళ్ళిచూపుల సమయంలో అక్క తలవంచుకుని చాపమీద కూర్చుంది. మిగతా అందరూ కుర్చీలమీద కూర్చున్నారు. కాబోయే అత్తగారు ఇంతింత కళ్లతో అక్కవంక చూస్తూ "నీకు వంటా వార్పు వచ్చా అమ్మాయ్?" అని అడిగింది.

అక్క నోరు తెరిచి జవాబు ఇవ్వకముందే అమ్మ "వచ్చండీ! అన్నీ నేర్పించాను అమ్మాయికి...చక్కగా ఇంటి పనులు చేస్తుంది" అంది.

"అమ్మాయిని మాట్లాడనివ్వండి!" అంది ఠక్కున ఆమె.

దాంతో "వచ్చండీ!"అంది అక్క మెల్లిగా.

"ఎందుకు అడుగుతున్నానంటే...మా ఊళ్లో పనివాళ్లు కూడా దొరకరు. అన్ని పనులూ మనమే చేసుకోవాలి. అదీగాక మాది పెద్ద కుటుంబం. వచ్చే పొయ్యే అతిథులు కూడా ఎక్కువే... అందుకే మంచి పనిమంతురాలైన కోడలు రావాలని అనుకుంటాను.." అంది.

అన్నట్టుగానే పెళ్ళయిన మర్నాటినుంచీ అక్కయ్యను పనిమనిషిని చేసేసింది. అయినా అక్కయ్య బాధ పడలేదు. ఎంతచేసినా, ఎంత మంచితనంగా ఉన్నా ఏదో ఒకటి పుల్లవిరుపు మాటో, దెప్పిపొడుపో, సాధింపో చేయటం 'మీ పుట్టింటివాళ్ళు అలాంటివాళ్లు...ఇలాంటివాళ్ళు' అంటూ విమర్శించడం..'మీ అమ్మ నిన్ను ఎలా పెంచిందే...పనీ పాటా..వంటా వార్పూ సరిగా నేర్పించకుండా కూతురు పెళ్లి చేసి అత్తవారింటికి ఎలా పంపించింది?' అంటూ దెప్పడం చేసేది.అక్క పుట్టింటికి పండగకో, పబ్బానికో వచ్చినప్పుడు అమ్మకు చెప్పుకుని బాధ పడేది.

"ఏం చేస్తాం అత్తలంటే అలాగే ఉంటారు. భరించక తప్పదు. ఈ రోజు కొత్తగా వచ్చాయా ఈ అత్తగారి ఆరళ్ళు! ఆడది భూమి మీద పుట్టినప్పటినుంచే మొదలయ్యాయి" అనేది అమ్మ నిట్టూరుస్తూ.

నిశ్శబ్దంగా వాళ్ళ మాటలు వినే తనకు ఒక విషయం మాత్రం అర్థమయ్యేది కాదు. 'అత్తా ఒకింటి కోడలే...ఇద్దరూ ఆడవాళ్లే. అయినా వీళ్లిద్దరికీ ఎందుకు పడదు?' అని.

ఆలోచనల్లో మునిగిపోయిన ప్రియను తల్లి రాజేశ్వరి "ఏమయిందే ఇవ్వాళ నీకు...అంత పరధ్యానంగా ఉన్నావ్? ఇందాకటినుంచీ చూస్తున్నాను కళ్లు తెరిచి చూస్తున్నావ్‌గానీ ఈ లోకంలో లేవు" అనటంతో ఉలిక్కిపడి...


ఆఁ...ఏంలేదు!" అంటూ లేచి అక్కడినుంచి వెళ్ళిపోయింది. కాలేజీలో క్లాసురూమ్‌లో కూర్చున్నా ప్రియను పెళ్ళి చూపులు...అక్కల కాపురాల గురించిన ఆలోచనలు వదలలేదు.

చిన్నక్క పెళ్ళి చూపులు రెండు మూడు సార్లు జరిగాయి. అక్క తెల్లగా లేదని ఒక సంబంధం, కట్నం ఎక్కువగా ఇవ్వటంలేదని మరొక సంబంధం తప్పిపోయాయి. ఇప్పుడు తనకు చిన్నబావ అయిన అతను పెళ్ళి చూపులకు వచ్చిన రోజు జరిగిన ఫార్సు అంతా ఇంతా కాదు.

చిన్నక్క అత్తగారు కోడలంటే తమ ఇంటి స్వంత ఆస్తి అన్నట్లు ఎంత అధికారంతో...కాసేపట్లోనో ఎన్ని ఆర్డర్లు జారీ చేసిందని.

కోడలు చదువుకోవచ్చుగానీ ఉద్యోగం చేయకూడదట! ఆడవాళ్ళు ఉద్యోగాలు చేయటం వాళ్ల ఇంటా వంటా లేదుట. కోడలు పొద్దున్నుంచీ సాయంత్రం దాకా ఆఫీసులో





కూర్చుంటే ఇల్లూ వాకిలి, మొగుడూ..పిల్లలు, అత్తమామల సేవ ఇవన్నీ ఎలా? అని ప్రశ్నించింది.

బావ ఓ పక్కన తల్లి మాటలకు తల ఊపుతూనే నేను చాలా మాడ్రన్ అన్నట్టు అమ్మాయితో ఒకసారి ప్రైవేటుగా మాట్లాడాలి అంటూ గదిలోకి తీసుకెళ్ళి ఓ అరగంటదాకా బయటకి రాలేదు. బహుశా అక్కడ కూడా రొమాంటిక్ మాటలు కాకుండా పెళ్ళయితే ఎలా వుండాలో...అణిగి మణిగి...లొంగి...అందరికీ విధేయంగా ఎలా కాపురం చేయాలో హితబోధ చేస్తూ కండిషన్స్ పెట్టి ఉంటాడు. పెళ్ళి అయ్యాక చిన్నక్కను "ఎలా ఉందే కొత్త కాపురం...అక్కడ అందరూ మంచివాళ్లేనా?" అని అడిగితే...అక్క అదోలా నవ్వి...

"మంచివాళ్ళుగా కనిపించే పక్కా స్వార్థపరులు...నన్ను ఒక్కదాన్ని పరాయిదాన్ని అన్నట్టు వదిలేసి వాళ్లంతా కలిసికట్టుగా, చాలా ప్రేమగా ఉంటారు. ఆ ఇంట్లో నేను ఒక యంత్రాన్ని.. కీ ఇవ్వగానే ఇల్లంతా గిరగిరా తిరుగుతూ అందరి అవసరాలూ తీర్చే రోబోను" అని చెబుతూ కాసేపు ఆగి మళ్ళీ అంది.

"అమ్మను బాగా చూసుకో! అంటారు ఆయన పదే పదే. ఆయన నాలుక మీద అమ్మ న్న మాట తప్ప 'మా ఆవిడ' అన్నమాట రాదు. అలా చిన్నప్పటినుంచీ ఆయనకు ట్రెయినింగ్ ఇచ్చింది మా అత్తగారు. ఏదయినా మాట్లాడాలని నేను ఆయన దగ్గరకు ఎప్పుడయినా వెళితే...వాళ్ళ అమ్మ ఏమయినా అనుకుంటుందేమోనని భయంతో దూరం జరుగుతారు ఆయన. ఒకరోజు 'ఇదేంటంటే' 'అమ్మ బాధపడటం సహజం కదా! ఇన్నాళ్ళూ తన కొంగు పట్టుకుని తిరిగిన నేను ఈరోజు నువ్వు రాగానే నీతో

క్లోజ్‌గా ఉంటే ఆ మార్పును అమ్మ తట్టుకోగలదా? అంటూ ప్రశ్నించారు.

మరి నా సంగతేంటి? అని కన్నీళ్ళు పెట్టుకుంటే రాత్రిళ్ళు గదిలో నిన్ను సుఖపెడుతూనే ఉన్నా కదా? అన్నారు. ప్రేమకు నా ఉనికికి ఆయన ఇచ్చే విలువ అది! మా అత్తగారికి మీరెవరయినా మా ఇంటికి రావడం...మీ ప్రస్తావనను నేను ఆ ఇంట తేవడం భరించలేరు. మీరంటే చిన్న చూపు. దాన్ని నేను సహించలేకపోతున్నాను'' అని అక్క అనగానే అమ్మ...


''మమ్మల్ని వాళ్ళు ఏం అన్నా నువ్వు పట్టించుకోకమ్మా...మా మూలంగా నీ కాపురంలో కలతలు రావడం జరగకూడదు. నువ్వు సుఖంగా, సంతోషంగా ఉంటే మాకు అంతే చాలు'' అంది.

ఆ మాటలు అక్కకు ఎలా అనిపించాయోగానీ తనకు మాత్రం నచ్చలేదు. 'అమ్మా నాన్నలను అత్తింటివాళ్ళు ఏం అన్నా పట్టించుకోకుండా..విని, సహించి ఎందుకు ఊరుకోవాలి?' అన్న ఉక్రోషం అంత చిన్న వయసులోనే తన మనసులోనుంచి తన్నుకుని బయటకు వచ్చింది. అంతే



## అదీ సంగతి

ఈమధ్యనే ఐశ్వర్యారాయ్ 36వ బర్త్‌డే జరుపుకుంది! ఆరోజు అనుకోకుండా ఓ పత్రికా సమావేశంలో వున్న కత్రినా కైఫ్‌ని ఐష్‌కి బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్తారా? అని ఓ విలేకరి అడిగితే- 'అసలా సంగతితో నాకేంటి సంబంధంఆ?' అంటూ ఇన్‌డైరెక్టుగా గ్రీటింగ్స్ చెప్పకుండా తప్పించుకుంది కత్రినా. కారణం- గతంలో మంచి ఫ్రెండ్‌గా వున్న ఐష్ అంటే సల్మాన్‌ఖాన్‌కి ఏమాత్రం 'గిట్టదు' కాబట్టి ప్రస్తుతం సల్మాన్‌కి క్లోజ్‌గా వుంటున్న కత్రినా ఆ విషయం గ్రహించి ఇలా విషెస్ చెప్పను అందని ఎవరయినా అర్థం చేసుకోగలరు.




కాదు. 'ఈ అత్తగార్లు అలా, ఎలా, ఎందుకు ఉంటారు? అన్న ప్రశ్నలు తనలో కలగటమేకాక ఇప్పటికీ అవి అలాగే ఉండిపోయాయి. మనిషి ఎదిగి...మెదడు మరికాస్త ఆలోచించడం మొదలయ్యాక ఇంటింటా రావణ కాష్ఠంలా నిత్యం రగులుతున్న ఈ అత్తాకోడళ్ళ కలహాలు ఇక ఆరిపోవడం అంటూ ఉండదా? అన్న ఆలోచన కూడా ఇప్పటికీ తనను వేధించడం మొదలుపెడుతోంది అని అనుకుంటూ ఉండగా ''ప్రియా! ఏంటే అలా కూర్చున్నావ్ ఇంకా! వాళ్ళు వచ్చే టైమయ్యింది. లేచి...ఇంక తయారవ్వు!'' అనటంతో ప్రియ అయిష్టంగానే లేచి తన రూమ్‌లోకి వెళ్ళింది. ప్రత్యేకంగా కాక మామూలుగానే తయారయింది.

* * *

సాయంత్రం నాలుగు గంటలకు సాంత్రో కారులో పెళ్ళివారు పెళ్ళిచూపులకు వచ్చారు. ప్రియ తల్లిదండ్రులు ఇద్దరూ హడావుడిగా కారు దగ్గరికి వెళ్ళి వాళ్ళను ఆహ్వానించారు. పిల్లవాడు చూడగానే బాగున్నాడు అనిపించేలా ఉన్నాడు. పెద్దరికం ఉట్టిపడుతున్నట్లుగా ఉన్నాడు తండ్రి మోహన్రావ్. పట్టుచీర, మెడ తిరగనన్ని నగలు, మగపిల్లవాడి తల్లినన్న అహం ఇవేవీ లేకుండా సింపుల్‌గా...చిరునవ్వు ముఖంతో కారులోనుంచి దిగింది తల్లి రామలక్ష్మి. ఆమె కట్టుకున్న లైట్ కలర్ వెంకటగిరి చీర, మెడలో పుస్తెలతాడు, ముత్యాల గొలుసు చూసే కళ్లకు చాలా ప్లెజెంట్‌గా కనిపించాయి.

ఆవిడ ఏదో ప్రైవేట్ స్కూలులో టీచర్‌గా పనిచేస్తోందట. లివింగ్‌రూమ్‌లో అందరూ సోఫాల్లో కూర్చున్న తర్వాత కూతుర్ని పిలిచి ''మా అమ్మాయి ప్రియమణి..'' అని పరిచయం చేసింది రాజేశ్వరి.

క్యాజువల్ డ్రస్‌లో సింపుల్‌గా ఉన్న ఆ అమ్మాయి...చూడగానే నచ్చేసింది. అందం, సింప్లిసిటీకన్నా ఎక్కువగా ఆకర్షించింది. ఆ నడకలో, మాటలో, ఆ కళ్లలో కనిపించే ఆత్మవిశ్వాసం!

''ఏమన్నా అడుగుతావా బాబూ అమ్మాయిని?'' అన్నాడు మధ్యవర్తిగా వచ్చిన ఓ పెద్ద మనిషి. చటుక్కున తలెత్తి చూసింది ప్రియ.

ఆయన అలా అనటం రామలక్ష్మికీ నచ్చలేదు...అందుకే...''ఆ మాట అబ్బాయినే కాదు...అమ్మాయినీ అడగండి'' అంది వాతావరణాన్ని తేలిక పరిచే ఉద్దేశంతో. దాంతో- ''మీరిద్దరూ అవతలి గదిలోకెళ్ళి సపరేట్‌గా మాట్లాడుకోవచ్చు...అని ఏరా?'' అంటూ పెళ్ళికొడుకువంక చూసాడు. అవసరం లేదన్నట్లుగా తల వూపాడు ఆ యువకుడు.

''ఏమ్మా...నువ్వేమయినా అబ్బాయితో పర్సనల్‌గా మాట్లాడతావా?''

ఆ మాటలకు తలెత్తి సూటిగా ఆమె కళ్లలోకి చూస్తూ...''ఆంటీ మీరు ఏమీ అనుకోనంటే...నేను మీ అబ్బాయితో కాదు...మీతో పర్సనల్‌గా మాట్లాడాలనుకుంటున్నాను'' అనగానే అందరూ ఒక్కసారిగా అదిరిపడ్డారు.

రామలక్ష్మి మాత్రం ఆ అమ్మాయి ధైర్యానికి, ముక్కుసూటితనానికి ముచ్చటపడుతూ 'నాతో ఏం మాట్లాడుతుందబ్బా' అని మనసులో అనుకుంటూనే కూర్చున్నచోటు నుంచి తక్కున లేచి ''పదమ్మా'' అంది.

''దాని ముఖం..అది మీతో మాట్లాడటం ఏమిటి...ఈ పిల్లలకు చిన్నతనం! తొందరపడి ఏదో అనేస్తూ ఉంటారు'' అంది రాజేశ్వరి కంగారుగా.

''ఫర్వాలేదండి...తనని మాట్లాడనివ్వండి...'' అని రాజేశ్వరికి సర్దిచెప్పి అవతలి గదిలోకి వెళ్ళింది. ఇద్దరూ ఎదురెదురు కుర్చీల్లో కూర్చున్నారు.

ఆ అమ్మాయి ఏం మాట్లాడుతుందో వినాలని కుతూహలంగా ఉంది . ఆమె తను మాట్లాడబోయే విషయంపట్ల సీరియస్‌గా ఉందని..ముఖంలో ప్రస్ఫుటమవుతున్న భావాలను బట్టి ఇట్టే తెలిసిపోతున్నది.

''ఆంటీ! నేనూ మీ అబ్బాయి పెళ్ళి చేసుకుంటే మనం ఇద్దరం అత్తాకోడళ్లమవుతాం. ఆ బంధంపట్ల నా మనసులో ఊహ తెలిసినప్పటి

నుంచీ...కొన్ని అనుమానాలు, భయాలు, నా భవిష్యత్ జీవితంపట్ల కొన్ని సందేహాలూ ఉన్నాయి. వాటిని క్లియర్ చేసుకుని...మీతో ఒక ఒప్పందానికి వచ్చాకే ఈ పెళ్ళికి ఓ.కె. చెప్పాలనుకుంటున్నాను. ఎందుకంటే మనదేశంలో ప్రతి ఇంటా అత్తాకోడళ్ల కలహాలు...కొంచెం కొంచెంగా ప్రతినిత్యం, ప్రతి నిముషం ఆమె జీవితాన్ని కాల్చివేస్తూ ఉన్నాయి. మా ఇంట్లోనే మా ఇద్దరి అక్కల జీవితాలను నేను స్వయంగా చూస్తున్నాను. అహం, పట్టుదల, బింకం వీటితో ఎవరికివాళ్లు...తమ ఆలోచనలను అభిప్రాయాలను, షికాయితులను మనసులో పెట్టుకుని...తమలో తామే కుమిలిపోవడం, ఇరుగిల్లకు, పొరుగిళ్ళకు వెళ్లో...పుట్టింటివాళ్ళతో మొరపెట్టుకుని సింపతిని ఆశించడమో చేయడంవల్లనే ఈ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. దానికన్నా కలిసి కూర్చుని మాట్లాడుకుంటే...ఓపెన్‌గా ఒకరి అభిప్రాయాలను ఒకరు షేర్ చేసుకుంటే ఈ కుటుంబ సమస్య ఇన్నాళ్లు తిష్టవేసుకుని కూర్చుని ఉండేది కాదు. ఆంటీ... మీరు మరోలా అనుకోకండి... ఇవి కండిషన్స్ అని తప్పుగా అర్థం చేసుకోనంటే నేను కొన్ని విషయాలు మీతో షేర్ చేసుకోవాలనుకుంటున్నాను...!'' అంది ప్రియ.

"చెప్పమ్మా! నేనేమీ అనుకోను. ఇలా మనసు విప్పి మాట్లాడే వాళ్ళంటే నాకూ ఇష్టమే..!'' అంది రామలక్ష్మి చిరునవ్వుతో.

"నేను మిమ్మల్ని మా అమ్మా నాన్నలుగానే చూసుకుంటాను. అంత ప్రేమగా, చనువుగా, అధికారంగా మీ ఇంట్లో మసలుతాను. మీరూ నన్ను మీ కూతురుగానే చూసుకోవాలి. అంటే ప్రేమించి, చనువిచ్చి, తప్పు చేస్తే మందలించి, నాలోని ప్లస్ పాయింట్స్‌తో పాటు, మైనస్‌లనూ యాక్సెప్ట్ చేసి ఇలా...!'' అని ప్రియ అంటుండగానే..

"తప్పకుండా..నేను మీ అత్తగార్ని అన్న అహాన్నే నా మనసులోకి రానివ్వను...'' అంది రామలక్ష్మి మనస్ఫూర్తిగా.

"పెళ్ళి చేసుకుని మీ ఇంట్లో అడుగుపెట్టగానే...మా అమ్మానాన్నలను, నా తోబుట్టువులను మర్చిపోవాలంటే అది నావల్ల కాదు. ఇప్పుడు నా మనసులో వాళ్ళమీద ప్రేమ, గౌరవం, ఇష్టం ఎలా ఉన్నాయో ఎప్పటికీ అలాగే ఉంటాయి. మీరు వాళ్లను అని చులకనగా చూడకూడదు..''

"మాకూ ఒక ఆడపిల్ల ఉంది కనుక...ఆడపిల్లను కన్న తల్లిదండ్రుల ఫీలింగ్స్...కూతురి అత్తింట్లో ఎదురయ్యే అవమానాలు అన్నీ అనుభవమే...అయినా మళ్ళీ నేనూ అలాగే ప్రవర్తిస్తానని అనుకోవటం లేదు. ఒకవేళ నాకు తెలియకుండానే నాలో అత్తనన్న అహంతో ప్రవర్తిస్తే...నువ్వు నన్ను నిస్సంకోచంగా నిలదీసి అడగవచ్చు'' అంది రామలక్ష్మి.

"ఆడపిల్ల అయి వుండి పొగరుగా మాట్లాడుతోంది...పెద్దా చిన్నా గౌరవం లేదు అనుకోకుండా ఇంత సహృదయంతో అర్థం చేసుకునే అత్తగారు ప్రతి కోడలికి దొరికితే నిజంగానే ఆ అవధిని అధిగమించగలం!'' అంది సుప్రియ మెచ్చుకోలుగా.ఇద్దరూ నవ్వుకున్నారు. మళ్లీ ప్రియే అంది.

"ఆంటీ! నేను ఒక ప్రశ్న మిమ్మల్ని సూటిగా అడుగుతాను. మీరూ సూటిగానే సమాధానం చెప్పండి..!'' ఏమిటన్నట్టు చూసింది రామలక్ష్మి.

"ఇంతసేపు నేనిలా మాట్లాడాక... మీరు ఏమనుకుంటున్నారు?''


"నువ్వు నాకు నచ్చావని అనుకుంటున్నాను. ఈ కాలం పిల్లలు ఇలాగే ఉండాలని అనుకుంటున్నాను. కోడల్ని బాధపెట్టడంలో అత్తగారి తప్పు ఎంత వుందో, ఆ బాధల్ని మౌనంగా భరిస్తూ తనకంటూ ఓ వ్యక్తిత్వం లేకుండా..బండరాయిలా పడివుండటంలో కోడలి తప్పూ అంతే ఉందని నా అభిప్రాయం. చదువుకున్న ఆడపిల్లలు సైతం తనకేం కావాలో..ఏం వద్దో...తనని ఏ విషయం బాధించిందో, అవమానించిందో నోరువిప్పి చెప్పకుంటే ఇక ఆ చదువుకు సార్థకత ఏముంది? మారుతున్న కాలంతో పాటు ఆడపిల్లలు ఆమాత్రం మారకపోతే ఇక అది ఆధునికత ఎలా అవుతుంది?'' అంది రామలక్ష్మి. ఆ మాటలు మంత్రముగ్ధను చేసాయి సుప్రియను. తనే ఇంతవరకూ ఏదో ఆదర్శభావాలతో మాట్లాడనని అనుకున్న ఆమెకు కాబోయే అత్తగారి ఆదర్శాలు ఆశ్చర్యచకితను చేసాయి.

"నేను మీకు నచ్చానని అన్నారు.. మీ అబ్బాయికి కూడా నచ్చితే మనం ఇద్దరం అత్తాకోడళ్లం అవుతాం. నిత్యం ఒక ఇంట్లో ఉండాల్సిన మంచి స్నేహితుల్లా ఉండగలిగితే మరెంతోమంది అత్తాకోడళ్ళకు ఆదర్శం కాగలిగితే...ప్రతి ఇంటా తరతరాల నుండీ మండుతూ వస్తున్న అత్తా కోడళ్ల కలహాలు అనే ఈ రావణకాష్ఠం క్రమంగానయినా ఆరిపోతుంది'' అంది ప్రియ.

"నిజమే!'' అంది రామలక్ష్మి. "ఇంక వెళ్దామా? బయట వాళ్ళు ఖంగారు పడుతూ ఉంటారు...'' అని మళ్ళీ తనే అంది.

నిజంగానే కంగారుపడుతున్న రాజేశ్వరిని చూసి "మ్యాచ్ సెటిల్డ్" అనడంతో ఆమెతోపాటు మిగతా అందరూ 'హమ్మయ్య' అనుకున్నారు.

★



## విమానంపై ఏక్రోబేటిక్స్

న్యూమెక్సికోలోని లాస్‌క్రూసెస్‌లో ఇటీవల రియోగ్రాండ్ ఎయిర్ షో జరిగింది. అప్పుడు ఒక విమానంపైన పైలెట్లు ఫ్రాంక్లిన్, గ్రీన్‌లు కత్తియుద్ధం చేసారు. తరువాత ఫ్రాంక్లిన్ విమానాన్ని పల్టీలు కొట్టిస్తుంటే గ్రీన్ దాని బయట అలాగే నిరాధారంగా వ్రేలాడాడు. ఈ డేర్ డెవిల్ ఏక్రోబేటిక్స్‌కి క్రిందనున్న వాళ్లు హడలిపోయారు.

-తటవర్తి

